

ప్రతి అర్జీ పరిష్కారం కావాలి 8లో



గంగవరం పోర్టుకు ప్రథమ బహుమతి 8లో



ఎస్‌బీసీ వంతెనపై రాకపోకలకు అనుమతివ్వాలి 8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.39 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 28 రోజులకుగాను రూ.1,39,44,045 వచ్చినట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై యాత్రిక సదన్‌లో సోమవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. నగదుతోపాటు 53 గ్రాముల బంగారం, 8,650 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌లో 18 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

విశాఖ సిటీ: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో 18 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇందులో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి నగరంలో పోస్టింగ్‌లు ఇవ్వడంతో పాటు ఇక్కడ ఉన్న వారిని వేరే చోటకు బదిలీ చేశారు. మహారాణిపేటకు ఎం.జ్ఞానేశ్వరి, వి.వేణుగోపాల్, సీతమ్మధారకు వై.విమలాదేవి, బి.చలంనాయుడు, గోపాలపట్నంకు ఎం.మోహన్‌రావు, వి.ఎల్.కరుణలత, గాజువాకకు ఇ.రామకృష్ణ, కె.నరసింహమూర్తి, పెందుర్తికి జి.శ్రీనివాసరావు, ఎల్.మాధవిలను నియమించారు. అలాగే భీమునిపట్నంకు బి.వెంకటరాజు, కె.అనీల్‌కుమార్, విశాఖ ఐఎంఎల్ డిపో-1కు ఆర్.శ్యామల, డిపో-2కు కె.ఎ.వినయ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్‌కు ఎస్.ముసలినాయుడు, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఎల్.అరుణకుమారి, పి.అప్పారావులను బదిలీ చేశారు.

రిటైర్డ్ పోలీసులకు సీపీ సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులతో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఏసీపీ, ఆర్ఎస్‌ఐ, ఏఆర్ఎస్‌ఐలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఏసీపీ సి.హెచ్.శ్యామలరావు, ఆర్ఎస్ఐ ఆర్.వి.రమణ, ఏఆర్ఎస్ఐ కె.ఆనందరావులు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. వీరిని కుటుంబ సభ్యులతో కమిషనర్ కార్యాలయానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చి సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లు సుదీర్ఘ కాలం సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు.

స్వర్ణాంధ్ర-2047పై విద్యార్థులకు పోటీలు



విజేతలతో డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: స్వర్ణాంధ్ర -2047పై విద్యార్థులకు సోమవారం జిల్లా స్థాయిలో వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 63 మంది పాల్గొన్నారన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్ చేతుల మీదగా బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. విజన్ డాక్యుమెంట్లలో విద్యార్థులంతా పాల్గొని రాష్ట్ర అభివృద్ధికి తగు సూచనలు ఇవ్వాలని సూచించారు.

ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లకు హెచ్‌సీలుగా పదోన్నతి



పదోన్నతులు పొందిన వారితో సీపీ బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిన నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పదోన్నతులు పొందిన ముగ్గురిని వారి కుటుంబ సభ్యులతో సోమవారం పోలీస్ సమావేశ మందిరానికి ఆహ్వానించారు. పదోన్నతి ర్యాంకులతో పాటు పోస్టింగ్ ఆర్డర్స్ అందజేశారు.

సిండికేటుగాళ్లు

ప్రైవేటు మద్యం పాలసీతో రంగంలోకి మాఫియా

- జిల్లాలో మద్యం వ్యాపారాన్ని శాసించడానికి సిద్ధమైన ముగ్గురు సిండికేట్లు
- ఒక రిసార్టులో రహస్య సమావేశం?
- ప్రాంతాల వారీగా మద్యం దుకాణాల పంపకాలపై చర్చ
- కూటమి ప్రజాప్రతినిధులకు వాటాపైనా త్వరలోనే నిర్ణయం
- సిండికేట్‌లో లేకుండా మద్యం షాపు దక్కించుకున్న వారికి చుక్కలే..



విశాఖ సిటీ: ఐదేళ్లు నిద్రాణంలో ఉన్న మద్యం సిండికేట్లకు కూటమి ప్రభుత్వం ఊపిరి ఊదింది. ప్రభుత్వ దుకాణాలను ప్రైవేటుకు అప్పగించే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. దీంతో ప్రైవేటు మద్యం వ్యాపారులు పండగ చేసుకోడానికి సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో లిక్కర్ సామ్రాజ్యాన్ని చేజిక్కించుకోడానికి సిండి'కేటుగాళ్లు' మళ్లీ రంగ ప్రవేశం చేశారు. మద్యం వ్యాపారాన్ని తమ హస్తగతం చేసుకోడానికి చాపకింద నీరులా పావులు కదుపుతున్నారు. ఒకవైపు కూటమి ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతూనే.. మరోవైపు షాపుల పంపకాలపై తర్జనభర్జనలు పడుతున్నారు.

'ప్రైవేటు' చేతికి మద్యం

వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించేది. దీంతో ప్రైవేటు లిక్కర్ మాఫియాకు అడ్డుకట్టపడింది. బెల్టు షాపులు నిర్వీర్యమైపోయాయి. అడ్డగోలు అమ్మకాలకు తెరపడింది. తాజాగా ఈ మద్యం దుకాణాలు మళ్లీ పాత విధానంలోకే వెళ్లనున్నాయి. ప్రభుత్వం చేతిలో ఉన్న ఈ షాపులు ఇపుడు ప్రైవేటుకు హస్తగతం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఒకటి, రెండు రోజుల్లో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఐదేళ్లు నిద్రావస్థలో ఉన్న లిక్కర్ మాఫియాకు మళ్లీ జవసత్వాలు వచ్చాయి. కూటమి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముగ్గురు ప్రధాన సిండికేట్లు ఏకమై తెరవెనక కథ నడిపిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇందులో ఒక సిండికేట్‌లో కూటమి ఎమ్మెల్యేకు సైతం వాటాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ దఫా మాత్రం సదరు ఎమ్మెల్యే కనుసన్నల్లోనే మూడు సిండికేట్లు పనిచేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

రహస్యంగా సమావేశం..



జిల్లాకు 145 వరకు మద్యం దుకాణాలు కేటాయించే అవకాశం ఉందని సిండికేట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో వాటిని దక్కించుకోడానికి ఇప్పటికే సిండికేట్లు వ్యూహ రచన చేస్తున్నాయి. ఇందుకోసం ఒక రిసార్టులో సిండికేట్ల ప్రతినిధులు ఇటీవల రహస్యంగా సమావేశమైనట్లు తెలిసింది. ఇందులో దుకాణాల పంపకాలు, ప్రజాప్రతినిధుల వాటాలు ఇలా అనేక అంశాలపై ఒక ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉంటే కొంతమంది వ్యాపారులు అప్పుడే మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించి షాపులను సైతం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ రాకముందే, వేలం నిర్వహించకముందే కొందరు షాపులకు లీజులు సైతం చెల్లిస్తుండడం గమనార్హం.

కొలిక్కిరాని వాటాల శాతం

ఇప్పటికే మద్యం షాపుల కోసం కొంత మంది వ్యాపారులు సిండికేట్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. వేలం ప్రక్రియ నుంచి వ్యాపారం వరకు అన్ని దశలలోను అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు వాటాలు ఇవ్వాలని అందరి నుంచి డబ్బు వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే ఎమ్మెల్యేలకు ఎంత వాటా అన్నది ఇంకా కొలిక్కిరానట్లు తెలుస్తోంది. దుకాణాల నుంచి వాటా శాతం నిర్ణయించే బాధ్యతలను కూటమికి చెందిన ఒక ఎమ్మెల్యేకు అప్పగించినట్లు వాదనలు ఉన్నాయి. ఈ సిండికేట్లను కాదని ఎవరైనా వేలంలో పాల్గొని షాపు దక్కించుకుంటే.. అనుమతులు, నిబంధనల విషయంలో ఎక్సైజ్ అధికారుల ద్వారా ఇబ్బందులకు గురిచేయాలని ఇప్పటికే అనధికారికంగా ఆదేశాలు జారీ చేసినట్లు చర్చ జరుగుతోంది.

లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయం



డాబాగార్డెన్స్: తిరుమల లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వంటి ఒక అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడాల్సిన తీరు ఇదేనా? అని ప్రశ్నించడంతోపాటు అసలు ఏ ఆధారంతో కల్తీ నెయ్యి వాడినట్లు నిర్ధారణకు వచ్చారని సుప్రీంకోర్టు అడగడం విశేషమన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి వంటి వ్యక్తి ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం అనుచితమని కోర్టు పేర్కొందన్నారు. తిరుమల వంటి ప్రపంచ స్థాయి పుణ్యక్షేత్రానికి ఉన్న పేరు ప్రఖ్యాతులకు మచ్చపడుతుందన్న విషయాన్ని కూడా కూటమి నేతలు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినబడుతున్నాయన్నారు. శ్రీవారి ప్రసాదంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసి హిందువులను మోసం చేశారని మండిపడ్డారు. నెయ్యి కల్తీ జరిగినట్టు సాక్ష్యం చూపించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించడంపై మేయర్ హర్షం వ్యక్తం చేశారు.

నేటి మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు అప్పన్న దర్శనాలు బంద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లభించవని దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ తెలిపారు. రానున్న శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయ శుద్ధి(కోయిల్ తిరుమంజన్ సేవ) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు కసరత్తు

- ఉపాధ్యాయులూ.. ఓటు హక్కు నమోదు చేసుకోండి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



ఉపాధ్యాయుల ఓటు నమోదుపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ వెలువడిందని, సోమవారం నుంచి ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నవంబర్ 6 వరకు కొనసాగుతుందన్నారు. నవంబర్ 23న డ్రాఫ్ట్ పబ్లిష్ అవుతుందని, 23 నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ,డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో 34 ఈఆర్వోలను, 187 మంది ఏఈఆర్వోలను నియమించామన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు సెకండరీ స్థాయికి మించిన పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులేనని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 43 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 1941 కేంద్రాలు ఉండగా 1500 ఓటర్లు దాటిన చోట కొత్త వాటిని ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్లు సీతారామమూర్తి, శేష శైలజ, లక్ష్మారెడ్డి, తహసీల్దార్లు, ఎలక్షన్ డీటీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల నిర్వాహకులపై ఆగ్రహం



వీధిలైట్లను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: నగరంలో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో ఆ ఏజెన్సీ నిర్వాహకులపై జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఆదివారం అర్ధరాత్రి నగరంలోని 3, 4, 5, 8 జోన్లలో పలు ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యుత్ దీపాల నిర్వహణను పరిశీలించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించామన్నారు. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి 2 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ దీపాల నిర్వహణ స్వయంగా చూశామన్నారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదన్నారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో నగర వ్యాప్తంగా విద్యుత్ దీపాల సమస్య పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.

ఇసుకే బంగారమాయేనా..!

'ఇసుకను పారదర్శకంగా అందిస్తున్నాం. టన్ను ఇసుక గరిష్ట ధర రూ.1076 మాత్రమే. ఇసుక విధానాన్ని సద్వినియోగం చేసుకోండి'.. ప్రభుత్వం చెబుతున్న మాట ఇది. కానీ క్షేత్రస్థాయిలో ఇసుక ఖరీదైన వనరుగా మారింది. పేదలు, సామాన్యులకు అందని ద్రాక్షగా మిగిలింది. ఇసుక విధానాన్ని ప్రభుత్వం మార్చినా ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదు.

- బ్లాక్‌లో టన్ను ఇసుక రూ.2,300కి పైమాటే..
- జిల్లాలో మూతపడిన ఇసుక డిపోలు
- రీచ్‌ల నుంచి రాని ఇసుక
- స్తంభించిన నిర్మాణ రంగం
- ఉచితం పేరుతో టీడీపీ నేతల దోపిడీ



మహారాణిపేట : జిల్లావాసులకు ఇసుక కష్టాలు తప్పడం లేదు. శ్రీకాకుళం నుంచి ఇసుక ఇప్పట్లో వచ్చేటట్లు కనిపించడంలేదు. రాజమండ్రి నుంచి ఇసుక తెచ్చుకోవడం తలకు మించిన భారంగా మారింది. దీంతో విశాఖవాసులకు ఇసుక దొరకడం గగనంగా మారింది. ప్రజల అవసరాలకు, ప్రభుత్వ నిర్మాణాలకు కూడా ఇసుక దొరక్క పనులు జాప్యమవుతున్నాయి. ఇసుక కొరత వల్ల నిర్మాణ రంగం స్తంభించిపోయింది. సొంత అవసరాలకు అత్యవసర పరిస్థితిలో బ్లాక్‌లో కొనుగోలు చేసి పనులు పూర్తి చేస్తున్నారు.

ఇతర ప్రాంతాలపై ఆధారం

విశాఖ జిల్లాలో ఇసుకకు ఎక్కువ డిమాండ్ ఉంది. అయితే డిమాండ్‌కు తగ్గ ఇసుక అందుబాటులో లేదు. ఇక్కడ రీచ్‌లు లేకపోవడంతో శ్రీకాకుళం, రాజమండ్రి నుంచి ఇసుక తెచ్చుకోవాల్సి వస్తోంది. విస్తారంగా వర్షాలు కురవడం వల్ల శ్రీకాకుళం నుంచి ఇసుక తీసుకురావడం కష్టంగా మారింది. మరో పది రోజుల వరకు శ్రీకాకుళం నుంచి ఇసుక వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

రాజమండ్రి ఇసుక మీద ఆధారం

రాజమండ్రి నుంచి ఇసుక తీసుకురావడం భారంగా మారింది. అక్కడ ఇసుక తక్కువ ధరకు వచ్చినా రవాణా ఖర్చులు తడిపి మోపెడవుతున్నాయి. టన్ను ఇసుకకు రూ.269 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. లారీ ఇసుక(10 టన్నులు)కు రవాణా చార్జీల కోసం రూ.16 వేలు వరకు చెల్లించాల్సి వస్తోంది. టోల్ చార్జీలు, ఇతర ఖర్చులు కలుపుకుంటే టన్ను ఇసుక రూ.రెండు వేలకు పైగా అవుతోంది. ఇంత ఖర్చు భరించి తెచ్చుకోవడం సామాన్య ప్రజలకు భారంగా మారింది. అక్కడ నుంచి తెచ్చుకోలేక ఇక్కడ అధిక ధరకు కొనుగోలు చేయలేక సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఖాళీ చేసేసి వదిలేశారు..

గత ప్రభుత్వం విశాఖ అవసరాల కోసం ప్రత్యేకంగా భీమిలితో పాటు అగనంపూడిలో ఇసుక డిపోలను ఏర్పాటు చేసింది. భీమిలి ఇసుక డిపోలో 39,800 టన్నులు, అగనంపూడి ఇసుక డిపోలో 63 వేల టన్నుల ఇసుకను నిల్వ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలల్లో ఈ ఇసుకను విక్రయించేసింది. ఆ తర్వాత కొత్తగా ఎక్కడ నుంచి ఇసుక రాలేదు. వర్షాల నేపథ్యంలో ముందస్తుగా ఈ డిపోలకు అదనపు ఇసుకను చేర్చాల్సి ఉంది. అయితే అటువంటి పనేమీ కూటమి ప్రభుత్వం చేయలేదు. కేవలం గతంలో ఉన్న ఇసుక నిల్వలను మాత్రం విక్రయించింది. కనీసం ఇసుక రేణువునూ కూడా అదనంగా ఈ డిపోలకు తరలించలేదు.

స్తంభించిన నిర్మాణ రంగం

విశాఖలో ఇసుక దొరకడం గగనంగా మారింది. దీంతో నిర్మాణ రంగం స్తంభించిపోయింది. అత్యవసరమైనవారు బ్లాక్‌లో ఇసుకను కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే బ్లాక్‌లో 10 టన్నుల ఇసుక రూ.23 వేల వరకు విక్రయాలు చేపడుతున్నారు. ఎక్కువగా ఒడిశా నుంచి తెచ్చిన ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తప్పనిపరిస్థితుల్లో బ్లాక్‌లో అధిక ధరకు ఇసుక కొంటున్నామని బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టన్ను ఇసుక కూడా తవ్వకపోగా.. ఉన్న నిల్వలను కాస్తా పక్కదారి పట్టించడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు.

ఉచితంపై ఉత్తుత్తి ప్రగల్భాలు

ఇసుక ఉచితమంటూ ఉత్తుత్తి ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం తూచ్ అంటూ.. అధిక ధరకు విక్రయిస్తోంది. అదనపు భారాన్ని తమపై మోపుతోందని నిర్మాణదారులు మండిపడుతున్నారు. పేదలకు చౌకగా ఇసుక అందిస్తామంటూ ఎన్నికల ముందు ఊకదంపుడు ఉపన్యాసమిచ్చిన చంద్రబాబు ఇప్పుడు మౌనం దాల్చారని వాపోతున్నారు. ఉచితమని చెప్పి విశాఖలోని డిపోల్లో టన్ను రూ.1076కి విక్రయించారు. ఇప్పుడు అది కూడా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎంలదే పెట్టుబడి

- పాఠశాలల నిర్వహణకు నిధులివ్వని ప్రభుత్వం
- చాక్ పీసులు కొనాలన్నా డబ్బుల్లేని పరిస్థితి
- హెచ్‌ఎంలకు తప్పని ఆర్థిక భారం
- స్కూల్ కాంప్లెక్స్, ఎమ్మార్సీలకు నిధుల లేమి
- ఉపాధ్యాయ సంఘాల వినతులపై పట్టని కూటమి ప్రభుత్వం



కరాస జీవీఎంసీ స్కూల్లో పాఠాలు చెబుతున్న హెచ్‌ఎం

విశాఖ విద్య: 'అంతన్నాడింతన్నాడే గంగరాజు.. ముంతమామిడి పండన్నాడే గంగరాజు' కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన చూసిన ఉపాధ్యాయులు ఇప్పుడిదే స్వరం అందుకుంటున్నారు. ఇటీవల చేపట్టిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై ఉపాధ్యాయ వర్గాల నుంచి నిరసన పెల్లుబకగా.. ప్రభుత్వం నాలుగైదు సార్లు ఉత్తర్వుల్లో సవరణ ఇచ్చినా, అసంతృప్తి జ్వాలలు చల్లారలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఠంఛన్‌గా నెలవారీ పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు.. ఇప్పుడు వీటి కోసమని ఎదురుచూడాల్సి వస్తోంది. బడులు తెరిచి మూడు నెలలకు పైగానే కావొస్తున్నా.. నిర్వహణ నిధులు (కాంపోజిట్ గ్రాంట్) విడుదల చేయలేదు. దీంతో పాఠశాలల నిర్వహణ భారం ప్రధానోపాధ్యాయులపైనే పడుతుంది. విద్యాశాఖలో చోటుచేసుకుంటున్న ఇలాంటి పరిణామాలతో 'బడి' తడబడుతోందనే చర్చ మొదలైంది.

భారమవుతున్న స్కూళ్ల నిర్వహణ

పాఠశాలల నిర్వహణ కోసమని ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు నిధులు మంజూరు చేస్తుంది. స్కూళ్లలో జరిగే కార్యక్రమాలు, మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాల నిర్వహణ సమయంలో టీ, బిస్కెట్ వంటి మర్యాదలు.. అదే విధంగా స్కూళ్లల్లో సౌకర్యాలు కల్పించేందుకు ఈ నిధులు వెచ్చిస్తారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా, పాఠశాలలకు ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించి, సౌకర్యాలను సమకూర్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో స్కూళ్ల నిర్వహణ భారమవుతోందని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

క్లాంప్లెక్స్ స్కూళ్ల దయనీయం

పాఠశాల నిర్వహణతో పాటు, కాంప్లెక్స్ స్కూళ్లగా గుర్తించిన వాటికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తారు. ఇప్పటికే రెండు దఫాలుగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. కానీ నిధులు అందుబాటులో లేక, నిర్వహణ భారం హెచ్‌ఎంలపై పడింది. 'చాక్‌పీసులు, డస్టర్లు కొనలేకపోతున్నాం.. పిల్లలకు అవసరమైన చార్టులు, పుస్తకాలు తెద్దామంటే డబ్బులు లేవు.. సమావేశాలకు వచ్చే టీచర్లకు టీ, స్నాక్స్ ఇవ్వలేకపోతున్నాం.. మొత్తంగా పాఠశాలల నిర్వహణ ఇబ్బందిగా మారింది..'అంటూ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. జిల్లాలో ఉన్న మండల రిసోర్స్ కేంద్రాల్లో సైతం నిధులు లేక ఇబ్బందులు తీరడం లేదు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేలా నిధులు

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్వహణ నిధులు మంజూరవుతాయి. 30 మందిలోపు విద్యార్థులు ఉన్న స్కూళ్లకు రూ.10 వేలు, 31-100 ఉంటే రూ.25 వేలు, అదే విధంగా 101-250 వరకు ఉన్నట్లైతే రూ.50 వేలు, 251-1000 వరకు ఉంటే రూ.75 వేలు విడుదల చేస్తారు. 1000కు పైగా విద్యార్థులు ఉన్న మధురవాడ లాంటి స్కూళ్లకు రూ.1 లక్ష వరకు మంజూరు చేస్తారు. జిల్లాలోని మధురవాడ పాఠశాలలో ప్రస్తుతం 3,380 మంది విద్యార్థులు ఉన్నారు. నిర్వహణ నిధులు అందుబాటులో లేకపోవడంతో ఇలాంటి స్కూళ్ల బాధ్యతలను చూసే ప్రధానోపాధ్యాయులు తమ జేబు డబ్బులను వెచ్చించాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి

నిర్వహణ నిధులు మంజూరయ్యే స్కూళ్లు **554**

వీటికి రావాల్సిన నిధులు రూ.**41.33** లక్షలు

స్కూల్ కాంప్లెక్స్‌లు **52**

వీటికి రావాల్సిన నిధులు రూ.**10.40** లక్షలు

మండల రిసోర్స్ కేంద్రాలు **11**

రావాల్సిన నిధులు రూ.**7.70** లక్షలు

విశాఖ -కిరండూల్‌కు అదనపు కోచ్‌లు



తాటిచెట్లపాలెం : ఈ సీజన్‌లో అరకు అందాలను వీక్షించే పర్యాటకులు, ప్రయాణికుల సౌకర్యార్థం, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితాను క్లియర్ చేసేందుకు కిరండూల్ రైళ్లకు ఆయా తేదీలలో, వారాంతపు రోజుల్లో అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 3,5,7,9,11,13,15,17,19వ తేదీలలో విశాఖలో బయల్దేరే విశాఖ -కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 4,6,8,10,12,14,16, 18,20వ తేదీలలో కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్-విశాఖ(08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు. ఈ నెల 2,4,6,8,10,12,14,16,18,20వ తేదీలలో విశాఖలో బయల్దేరే విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 3,5,7,9,11,13,15,17,19,21వ తేదీలలో కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్-విశాఖ(08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు. ప్రయాణికుల ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని వాల్తేర్ డివిజన్ అధికారులు సూచించారు.

ప్రతి అర్జీ పరిష్కారం కావాలి



వినతుల వివరాలు నమోదు చేసుకుంటున్న కలెక్టరేట్ ఉద్యోగి

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే ప్రతి అర్జీ పరిష్కారం కావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. ఆ దిశగా చిత్తశుద్ధితో, బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 303 వినతులు అందగా, అందులో రెవెన్యూకి 90, జీవీఎంసీకి 63, పోలీస్ శాఖకు 17, ఇతర శాఖలకు చెందినవి 133 అర్జీలు ఉన్నాయి.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కి 102 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 102 వినతులు అందాయి. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో జోన్-1కు 2, జోన్2కు 18, జోన్3కు 22, జోన్4కు 7, జోన్5కు 16, జోన్6 కు 16, జోన్7కు ఒకటి, జోన్-8కి 7 ఫిర్యాదులు అందగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 13 ఫిర్యాదులు అందాయని మేయర్ తెలిపారు. అనంతరం కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ఆర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు వినయ్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీ(రెవెన్యూ) శ్రీనివాసరావు, డీడీహెచ్ దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 96 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

పోలీసులపై బీచ్ వ్యాపారుల దాడి

బీచ్‌రోడ్డు: పోలీసులపై బీచ్ వ్యాపారులు దాడికి పాల్పడ్డారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..అల్లూరి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఎస్.కె. రహీం, నగరానికి చెందిన హోంగార్డులు అనిల్, నూకరాజు ఆదివారం బీచ్‌కు వెళ్లారు. అక్కడ ఐస్ క్రీం కొనుగోలు చేశారు. నగదు చెల్లింపు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో చుట్టపక్కల ఉన్న బీచ్ వ్యాపారులు చేరుకుని వీరి ముగ్గురిపై దాడి కి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోలీసులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సోమవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- వివిధ శాఖల అధికారుల తీరుపై కలెక్టర్ అసంతృప్తి
- 10లోగా పీఎం విశ్వకర్మ దరఖాస్తులు పరిశీలించాలని ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద జిల్లాలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించకపోవడం పట్ల కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. ఇకపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ యోజన, 100 రోజుల్లో ప్రభుత్వ శాఖల లక్ష్యాలు-ప్రగతి, స్వర్ణాంధ్ర విజన్- 2047, విశాఖ విజన్-2029లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీలోగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి, పీఎంవీకేవైపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈనెల 10వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, ధ్రువీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు 100 రోజుల్లో సాధించబోయే లక్ష్యాలు, ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2049 డాక్యుమెంట్‌తో పాటు విశాఖ విజన్-2029 పేరుతో రెండు, మూడు పేజీల్లో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి శాఖ రానున్న ఐదేళ్లలో సాధించనున్న ప్రగతి, తద్వారా ప్రతి ఏడాది 15 శాతం ఆర్థిక ఎదుగుదల లభ్యత ఉండేలా ప్రణాళికలు రచించాలని తేల్చి చెప్పారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, సీపీఓ వి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సీహెచ్.గణపతి, డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.శోభారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ పి.జగన్నాథరావు, హౌసింగ్ పీడీ ఆళ్ల శ్రీనివాస్, డీఈవో ఎల్.చంద్రకళ, వికలాంగుల సంక్షేమాధికారి జె.మాధవి, డీఐపీఆర్వో ఎస్వీ రమణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి రూ.4,45,127 అందజేసిన మహిళా సమాఖ్య



సైనిక సంక్షేమ నిధి కోసం సేకరించిన నిధుల చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

జిల్లాలోని మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలపడాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆకాంక్షించారు. మరిన్ని మంచి సేవా కార్యక్రమాలు చేసేందుకు జిల్లా సమాఖ్య ముందుకు రావాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. సైనిక సంక్షేమ నిధి కోసం జిల్లా మహిళా సమాఖ్య తరఫున పాత, కొత్త సంఘాలు కలిసి వేసుకున్న చందా రూ.4,45,127 చెక్కును కలెక్టర్‌కు సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ దేశ భద్రత కోసం నిరంతరం శ్రమించే సైనికులకు, వారి కుటుంబాల సంక్షేమ నిధికి మహిళా సంఘాల సభ్యులు ముందుకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత ఎదగాలని కోరారు. డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.శోభా రాణి మాట్లాడుతూ జిల్లాలో 4,800 మహిళా సంఘాలు ఉన్నాయని, సైనిక సంక్షేమ నిధి కోసం జిల్లా మహిళా సమాఖ్యకు పిలుపునివ్వగా పాత మహిళా సంఘాలతో పాటు కొత్తగా ఏర్పడిన సంఘాలు కూడా ఇందులో భాగస్వామ్యమయ్యాయని ఆమె జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, డీఆర్డీఏ పీడీ ఎం.ఎస్. శోభా రాణి, మహిళా సంఘ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది



ఉద్యోగ విరమణ పొందిన వారితో అధికారులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది వంటిదని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఆరుగురు ఉద్యోగులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారంతా శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రావిడెంట్ నగదు రూ.41,26,931 అందజేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పద్మజ, ఏపీఎంఈఎస్ఏ ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, జెమ్స్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, పర్యవేక్షకుడు సన్యాసిరావుతో పాటు పదవీ విరమణ పొందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, రికార్డు అసిస్టెంట్ రఘురామ్, మజ్దూర్లు వెంకట్రావు, వెంకటరమణ, వాచ్‌మన్ వీర్రాజు, పీహెచ్ వర్కర్ సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీసీ వంతెన పై రాకపోకలకు అనుమతివ్వాలి



ఆందోళన చేస్తున్న మహిళలు

సింధియా: ఎస్‌బీసీ వంతెన పై నుంచి నావెల్, సివిల్ సర్వీస్ ఉద్యోగులందర్నీ రాకపోకలకు అనుమతించాలని మేఘాద్రిపేట కాలనీలో నివసిస్తున్న నావెల్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు సోమవారం డాక్‌యార్డ్, విజయనగర్ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ వంతెన మూసివేయడం, దానికి ప్రత్యామ్నాయం చూపకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. పోర్టు రోడ్డులో ప్రయాణించడంతో ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు..ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా రక్షణరంగ ఉద్యోగులు, పలు విభాగాల కార్మికులు నావెల్ డాక్‌యార్డ్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని ట్రేడ్ యూనియన్ నాయకులు ఆందోళనకు మద్దతివ్వాలని మహిళలు కోరారు.

స్టీల్ కార్మికులను తొలగిస్తే ఊరుకోం



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ : స్టీల్ కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ఊరుకునేదిలేదని ఇంటక్ జాతీయ నాయకుడు మంత్రి రాజశేఖర్ హెచ్చరించారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులతో కలిసి సోమవారం స్టీల్ బీసీ గేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే సహించేది లేదని వారిలో తమ విలువైన భూములను ప్లాంట్ కోసం త్యాగం చేసిన నిర్వాసితులు ఉన్నారని, వారి ఉపాధికి గండికొట్టేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని ధ్వజమెత్తారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమండ్ చేశారు. అనంతరం స్టీల్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పులి రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, కొవిరి అవతారం, నమ్మి రమణ, దొమ్మేటి అప్పారావు, పితాని భాస్కరరావు, వంశీకృష్ణ యాదవ్, రమణమూర్తి, మద్ది అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి కడుపులో 8 కిలోల కణితి తొలగింపు



శస్త్ర చికిత్స వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

ఆరిలోవ : హెల్త్‌సిటీలోని ఒమేగా ఆస్పత్రి వైద్యులు ఓ వృద్ధురాలి కడుపులోంచి 8 కిలోల కణితిని విజయవంతంగా తొలగించారు. ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శస్త్ర చికిత్స చేసిన విధానాన్ని వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ అచ్యుతాపురానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు కడుపు నొప్పితో బాధపడుతుండడంతో ఆమె బంధువులు ఒమేగా ఆస్పత్రిలో సంప్రదించారన్నారు. ఆమె కడుపులో పెరుగుతున్న గడ్డ, ఆ గడ్డ అండాశయ క్యాన్సర్‌గా మారినట్లు పరీక్షలు ద్వారా గుర్తించామన్నారు. ఆ గడ్డ బాగా పెరిగిపోయి పొట్టంతా ఆక్రమించి పేగు భాగాలను, ఎడమ మూత్రనాళంపై ఒత్తిడి తీసుకువచ్చిందన్నారు.దీంతో ఆమెకు ఆరోగ్యశ్రీ ద్వారా సర్జరీ చేసి కడుపులో ఉన్న 8 కిలోల కణితిని విజయవంతంగా తొలగించామన్నారు. ఇది 37 సెంటీమీటర్ల పొడవు ఉందన్నారు. ఇంత పెద్ద కణితిని విజయవంతంగా తొలగించడం అరుదైన విషయమని ఆయన తెలిపారు.ఇప్పుడు ఆమె ఆరోగ్యంతో ఉన్నారన్నారు. సోమవారం ఆమెను డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీహర్ష, శృతి, విజయ్‌కుమార్, అనూష పాల్గొన్నారు.

అలసత్వాన్ని ప్రదర్శిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ ప్రణాళిక విభాగంలో మధ్యవర్తుల ప్రమేయం ఉండకూడదని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రణాళిక, పరిపాలన, సాంకేతిక విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దస్త్రాలను క్లియర్ చేయడంలో ఉద్దేశపూర్వకంగా అలసత్వాన్ని ప్రదర్శిస్తే ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోర్టు కేసులకు సంబంధించిన అంశాలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో తగినంత సిబ్బంది వీఎంఆర్‌డీఏకు రావడంతో ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికలో ప్రాధాన్యత క్రమంలో పర్యాటక, పారిశ్రామిక, విద్యా సంస్థలకు, కొత్తగా లేఅవుట్లు వేసేందుకు అనువుగా ఉన్న రహదారులను గుర్తించాలని సూచించారు. అంతకుముందు కమిషనర్ విశ్వనాథన్ సిరిపురం ప్రాంతంలో ఉన్న గురజాడ కళాక్షేత్రాన్ని సందర్శించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు.

గంగవరం పోర్టుకు బహుమతి

పెదగంట్యాడ: సీఐఐ సదరన్ రీజియన్ కైజెన్ పోటీలలో గంగవరం పోర్టుకు ప్రథమ బహుమతి లభించింది. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ కంటిన్యూస్ ఇంప్రూవ్‌మెంట్ (కైజెన్) నిర్వహించిన పోటీలలో దక్షిణ ప్రాంతం నుంచి అదానీ గంగవరం పోర్టు ప్రతిభ కనబరించింది. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ కైజెన్ పోటీలలో ప్రథమ స్థానాన్ని సాధించడం పోర్టు పనితీరుకు నిదర్శనమన్నారు. ఉద్యోగుల కృషి కారణంగా లభించిన గౌరవమని, ఇది సంస్థకు ఎంతో గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింతగా సేవలందిస్తామని ప్రకటించారు.

ఇంటికి చేరిన కానిస్టేబుల్

పీఎంపాలెం: మహిళా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ అదృశ్యమైన కానిస్టేబుల్ ఇంటికి చేరాడు. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు..ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకట నరసింహ మూర్తి గత నెల 22వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య కోమలి ఫిర్యాదు చేసింది. ఇదిలావుండగా అదృశ్యమైన కానిస్టేబుల్ మూర్తి తనకు తానుగా ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. పని ఒత్తిడి కారణంగా ప్రశాంతత కోసం తిరుమలవెంకన్న , విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నాడని, అంతేతప్ప మరే ఇతర కారణాలు లేవని రాతపూర్వకంగా తెలియజేశాడని సీఐ బాలకృష్ణ చెప్పారు.

గోవు మృతి- ఐదుగురు సస్పెన్షన్



దీన్‌దయాల్‌పురం వద్ద పశు సంరక్షణ కేంద్రంలో ఆవు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎంహెచ్ కిశోర్..

ఆరిలోవ: జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రంలో ఓ ఆవు మృతి చెందిన సంఘటనలో ఐదుగురు వైద్య ఆరోగ్య సిబ్బందిని సస్పెండ్ చేశారు. వివరాలు ఇలా..జీవీఎంసీ 20వ వార్డు పరిధి పోలమాంబ ఆలయ ప్రాంతంలో పిన్నింటి మోహనరావుకు చెందిన చూడితో ఉన్న ఆవు ఈనెల 26న రోడ్డు డివైడర్‌పై ఉన్న మొక్కలు మేస్తుండగా పశు సంరక్షణ కేంద్రం సిబ్బంది పట్టుకొన్నారు. దీన్ని 13వ వార్డు పరిధి దీన్‌దయాల్‌పురంలో ఉన్న జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. అప్పటి నుంచి సంరక్షణలో ఉన్న ఆవు ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకొన్న ఆవు యజమాని మోహనరావు, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌తో కలిసి సోమవారం కేంద్రానికి చేరుకొని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తన ఆవు మృతి చెందిందని జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జోన్-2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ కేంద్రానికి చేరుకొని మృతి చెందిన ఆవును పరిశీలించారు. నిర్లక్ష్యం వహించిన ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. పశువులను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని, పాడి, చూడితో ఉన్న ఆవులను రోడ్లపై విడిచిపెట్టవద్దని ఆవు యజమానికి సూచించారు.

పీతల పెత్తనంపై అధికారుల ఆగ్రహం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రహదారులపై పశువులు సంచరించకూడదని ప్రభుత్వ నిబంధనలున్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే పశువులను జీవీఎంసీ సిబ్బంది క్యాటిల్ షెల్టర్‌కు తరలిస్తారు. దీనిపై పీతల మూర్తి యాదవ్ క్యాటిల్ షెల్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులకు చిర్రెత్తుకొచ్చింది. నిబంధనలు మేరకు పనిచేస్తుంటే పీతల పెత్తనం ఏంటని అధికారులు చర్చించుకున్నట్టు తెలిసింది. ఇటీవల ఓ యజమాని చూడి ఆవును రోడ్డుపై విడిచిపెట్టాడు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న ఆవును జీవీఎంసీ సిబ్బంది క్యాటిల్ షెల్టర్ తరలించారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఆవు ఆదివారం మృతి చెందింది. దీంతో ఆవు యజమాని పీతల మూర్తిని వెంటేసుకొని వచ్చి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడం తగదని అధికారులు పేర్కొంటున్నారు. సామాన్యులను జీవీఎంసీ అధికారులు ఇప్పటికీ పీక్కు తింటున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, గోరక్షణకు ప్రాధాన్యతనిచ్చే బీజేపీ కూడా దీనిలో భాగస్వామ్యం అన్న విషయాన్ని అధికారులు ఇప్పటికీ గుర్తించకపోతే ఎలా? అంటూ పీతల ఆరోపణలు చేయడంపై జీవీఎంసీ అధికారులు విస్మయం చెందుతున్నారు.

ప్రతి అంశాన్ని వైఎస్సార్‌సీపీతో ముడి..

కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు కావస్తోంది. ప్రతి అంశాన్నీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో లింక్ పెడుతూ విమర్శలు చేస్తున్న పీతల మూర్తి యాదవ్ వైఖరిపై వైఎస్సార్‌సీపీ నేతలు గుర్రుగా ఉన్నారు. ఏం మాట్లాడాలో ఆలోచనలేని పీతల మూర్తి దిగజారుడు విమర్శలు చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొంటున్నారు.

వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులకు నియామక పత్రాలు



నియామక పత్రాలు అందుకున్న వారితో మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ స్వాతిదాస్ తదితరులు

దాబాగార్డెన్స్: రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జారీ చేసిన నియామక పత్రాలను జీవీఎంసీలో వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శులకు సోమవారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వుల మేరకు రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విశాఖకు 49 మందిని సూపర్ న్యూమరరీ ఉద్యోగులుగా ఖరారు చేస్తూ జారీ చేసిన నియామక పత్రాలను అందజేశామన్నారు. నియామక పత్రాలు పొందిన వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శులకు విధి నిర్వహణ పట్ల ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ స్వాతిదాస్, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.